జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 17-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 102 పేజీలు: 8 వెల : రూ.7



# అంతుచిక్కని.. వాణి వ్యూహం

- పదో రోజుకు చేరుకున్న నిరసన దీక్ష.
- కార్ షెడ్‌లోనే నిరసన చేస్తున్న వాణి కుటుంబ సభ్యులు
- ఇంటి నుంచి బయటకు రాని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తారంటూ విస్తృత ప్రచారం
- దువ్వాడ శ్రీనుకు ముఖం చాటేసిన ముఖ్య కార్యకర్తలు, నాయకులు
- వాణికి కుటుంబ సభ్యుల నుంచి పెరుగుతున్న మద్దతు
- ఇది కుటుంబ వ్యవహారం అంటూ లైట్ తీసుకుంటున్న కేడర్..
- ఏమాత్రం వెనుకకు తగ్గని దివ్వల మాధురి

**రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపన సృష్టిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ భార్య జడ్పిటిసి దువ్వాడ వాణిల మధ్య కుటుంబ వ్యవహారం 10వ రోజుకు చేరింది. దువ్వాడ శ్రీనివాస్ వైఎస్ఆర్ పార్టీ చెందిన దివ్వల మాధురి అనే వివాహితతో ఉన్న సంబంధం నేపథ్యంలో గత పది రోజులుగా అనేక నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశంపై విస్తృతంగా ప్రచారం కూడా జరిగింది. దువ్వాడ వాణి శ్రీనివాస్ వ్యవహారం పేరుకే కుటుంబ నేపథ్యమైనప్పటికీ దీని వెనుక అనేక రాజకీయ బలమైన కారణాలు ఉన్నాయంటూ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గత వైఎస్ఆర్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ పైన జనసేన పార్టీ అధినేత పైన తీవ్రంగా విరుచుకుపడిన దువ్వాడ శ్రీనివాస్‌ను బుద్ధి చెప్పేందుకు తెర వెనుక టిడిపి పావులు కదుపుతుందని ప్రచారం జరుగుతోంది. ఇదంతా అచ్చం నాయుడు తెర వెనుక ఆడిస్తున్న నాటకం అంటూ శ్రీనివాస్ మీడియా ముందు చెప్పడం విశేషం.**

**టెక్కలి, ఆగస్టు16 (వార్త):** గత పది రోజులుగా కారు షెడ్ లోనే తను తన పిల్లలతో దువ్వాడ వాణి నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవహారంలో వానమ్మ వ్యూహం అంతుచిక్కడం లేదు. తనకు ఈ వయసులో విడాకులు ఏంటంటే తన పిల్లలకు తండ్రి కావాలంటూ నూతన గృహంలో స్థానం కావాలంటూ దువ్వాడ వాని పట్టు పట్టింది అయితే ఐదు డిమాండ్లను దువ్వాడ శ్రీనివాస్ ముందు ఉంచింది దువ్వాడ శ్రీనివాస్ మూడు డిమాండ్లకు అంగీకరించి రెండు డిమాండ్లను తిరస్కరించారు తనకు విడాకులు కావాలని ఈ నూతన గృహాన్ని ఇచ్చేది లేదంటూ దువ్వాడ శ్రీనివాస్ స్పష్టం చేశారు రాజీ ప్రయత్నాలు విఫలమైనప్పటికీ దువ్వాడ వాణి మాత్రం కార్ షెడ్ లోనే నిరసన తెలుపుతుంది జమీందారీ కుటుంబంలో పుట్టి అత్యంత విలాసవంతమైన జీవనం గడిపిన దువ్వాడ వాణి కారు షెడ్డులో సాధారణ మంచాల పైన దోమల మాతో ఉన్నప్పటికీ భరిస్తూ అక్కడే ఉండడం చర్చినియాంశంగా మారింది మొదట మూడు రోజుల తప్పిస్తే ఆ తరువాత ఈ అంశం గురించి వాణి మీడియా ముందు మాట్లాడటం లేదు దీనితో వాణి వ్యూహం ఏమిటో అంతుచిక్కడం లేదంటూ పలువురు విశ్లేషించుకుంటున్నారు కుటుంబ వ్యవహార నేపథ్యంలో వీరు ఇరువురు కేసులు పెట్టిన అవి బెయిల్ బుల్ కేసులు కాబట్టి అరెస్టులు జరిగే అవకాశం కూడా కనిపించడం లేదు అయితే ఈ వ్యవహారానికి ముగింపు ఏమిటి అంటూ



పలువురు ప్రశ్నిస్తున్నారు

### దువ్వాడ సస్పెన్షన్ అంటూ.. దుమారం

దివ్వల మాధురితో తమకున్న సంబంధాన్ని మీడియా ముఖంగా బహిరంగంగా ఒప్పేసుకొని విమర్శలు పాలైన దువ్వాడ శ్రీనివాస్‌ను వైఎస్ఆర్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారు అనే దుమారం రేగుతోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో దువ్వాడ శ్రీనివాస్ దివ్వల మాధురి వ్యవహారం తెగ ట్రోల్ అవుతుంది. ఈ నేపథ్యంలో పార్టీ పరువు గంగలో కలిసిందని దువ్వాడ శ్రీనివాసను పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ ఎమ్మెల్సీకి రాజీనామా చేయించాలని దువ్వాడ శ్రీనివాస్ వ్యతిరేకవర్గం తెర వెనుక పావులు కదుపుతున్నట్లు సమాచారం. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడుగా ఉంటూ జగనన్న దైవం అని పొగడ్తలతో ముంచెత్తే దువ్వాడకు పార్టీ నుంచి సస్పెండ్ చేసే ప్రసక్తే లేదనే వాదన కూడా వినబడుతుంది. గత 30 సంవత్సరాలుగా టెక్కలి నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీని కింజరాపు అచ్చం నాయుడు కంచుకోటగా మలుచుకున్నారు గత ఎన్నికల్లో కూడా ఎలాగైనా టెక్కలి నియోజకవర్గంలో వైఎస్ఆర్ పార్టీ జెండా ఎగురువయ్యాలని రాష్ట్రంలో అందరికంటే ముందుగానే టికెట్ను ప్రకటించినప్పటికీ దువ్వాడ శ్రీనివాస్ ఓటమిపాలయ్యాడు. అధిక శాతం కార్యకర్తలు వ్యతిరేకిస్తున్న దువ్వాడ శ్రీనివాస్‌ను రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెనకేసుకురావడం, ఇప్పుడు దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారంపై కనీసం కార్యకర్తలు కూడా స్పందించడం లేదు. ఇది కుటుంబ వ్యవహారం మాకెందుకులే అంటూ లైట్ తీసుకుంటున్నారు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ తలుపులు తెరిస్తే కింజరాపు శిబిరంలో చేరేందుకు చాలా మంది సిద్ధమవుతున్నట్టు వైకాపా వర్గీయులే చెప్పడం విశేషం. ఏది ఏమైనా టెక్కలి నియోజకవర్గంలో మళ్లీ వైఎస్ఆర్ పార్టీ బతికి బట్ట కట్టాలంటే ఈ అంశంపై జగన్మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్యకర్తలు బహిరంగంగా చెబుతున్నారు..

### నేడు భారీ ట్విస్ట్ ఇవ్వనున్న దువ్వాడ వాణి..

గత కొద్దిరోజులుగా మౌనంగా నిరసన దీక్ష చేస్తున్న దువ్వాడ వాణి శ్రీనివాస్‌కు శనివారం నాడు భారీ ట్విస్ట్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. దువ్వాడ శ్రీనివాస్ ఎప్పుడు మాట్లాడిన తను ఎవర్ని ఇబ్బంది పెట్టలేదని తనకు అవినీతి మరకలు లేవంటూ బల్లగుద్ది మరీ చెప్తుంటారు. అయితే దువ్వాడ శ్రీనివాసను సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా పతనం చేసే దిశగా దువ్వాడ వాణి అడుగులేస్తున్నట్లు స్పష్టమవుతుంది. ఈ నేపథ్యంలో మరింత ఇరికించే ప్రయత్నం జరిగే అవకాశం ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ప్రస్తుతం గత రెండు రోజులు పాటు నిశ్శబ్ద వాతావరణం నెలకొన్నప్పటికీ నేటి నుంచి మళ్లీ రగడ ప్రారంభమయ్యే పరిస్థితిలో కనబడుతున్నాయి.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నేడు మందసలో విద్యుత్ అంతరాయం

మందస, ఆగస్టు 16 (వార్త): మందస మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ యోగీశ్వరరావు, ఏఈ ఎల్.యోగి తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మందస సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, నిర్వహణ, హరిపురము సబ్ స్టేషన్ పరిధిలోని అంబుగాం ఫీడర్ ఆనుకొని ఉన్న చెట్లు, కొమ్మలు తొలగిస్తామన్నారు. దీంతో వాటి పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

## నరసన్నపేటలో..

నరసన్నపేట, ఆగస్టు 16 (వార్త): నరసన్నపేటలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నరసన్నపేట పరిధిలోని ప్రధాన రహదారి, మారుతీ నగర్, లక్ష్మీనగర్, కంబకాయ రహదారి, జయలక్ష్మి నగర్, పచోరి కాలనీల్లో మరమ్మతుల కారణంగా అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

# వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

■ భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి పూజలు ■ గ్రామాల్లో శావణ శుక్రవారం శోభ ■ సామూహికంగా వ్రతాల నిర్వహణ

సారవకోట, ఆగస్టు 16(వార్త): సారవకోట మండలంలోని గొర్రిబంద గ్రామంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల మహిళలు పాల్గొనగా అర్చకులు సోమే శ్వరరావు వారితో కుంకుమార్చనలు చేయించారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు జరిపారు.



**వాసుదేవుని సన్నిధిలో..**

మందస, ఆగస్టు 16 (వార్త): వరలక్ష్మీ వ్రతాలు, శ్రావణ శుక్రవారం సందర్భంగా మందసలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ పూజలను మహిళలు భక్తి,శ్రద్ధలతో జరిపారు. కొన్నిచోట్ల సామూహిక వ్రతాలను నిర్వహించారు. వేకువజామునే మహిళలు ఇళ్లను శుభ్రపరిచి, తోరణాలు, పువ్వులు, వివిధ పత్రాలతో చక్కగా అలంకరించి.. పూజలు ప్రారంభించారు. మందసలోని అన్నపూర్ణమ్మతల్లి ఆలయంలో మహిళలతో శ్రావణ వరలక్ష్మి పూజలను సామూహికంగా అర్చకుడు కొమ్మాజోస్యుల సీతారామశర్మ, గోవిందుకలియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇప్పిలి వెంకటేశ్వరరావు, ఊణ్న చిన్నరమేష్, జగన్నాథ బెహరా, వీవీ రమణమూర్తి, దేవరశెట్టి మార్కండేయులు, శనపతి కిశోర్‌కుమార్, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. వాసుదేవుని సన్నిధిలో రాజ్యలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చనలు గావించారు. వాసు




దేవపెరుమాళుని జన్మనక్షత్రం మూలా నక్షత్రం ఇదేరోజు కావడంతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకం నిర్వహించి, ప్రత్యేకాలంకృతుడిని చేశారు. దివ్యాలంకృతుడైన వాసుదేవుడిని కనులారా భక్తులు దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**గార:** గార మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో గావించారు.

**స్వేచ్ఛావతి ఆలయంలో ..**

ఇచ్ఛాపురం, ఆగస్టు 16(వార్త): ఇచ్ఛాపురం గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వైభవంగా పూజలు నిర్వహించారు.

వరలక్ష్మీవ్రతంతో పాటు సింహాసంక్రమణ కూడా కలిసి రావడంతో వివిధ పూజలు జరిపారు. జగన్నాథస్వామి ఆలయంలో కొలువు దీరిన మహాలక్ష్మి అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా స్థానిక కళాకారులు ధనవతి, వెంకటేశ్వరి, గోవిందు, కృష్ణారెడ్డి తదితరులు తమ గాత్రంతో అలరించారు. వీరికి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.



స్వేచ్ఛావతి ఆలయంలో .. కళాకారులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

# 'సీతంపేట ఐటీడీఏ పీవోగా ఐఏఎస్‌నే నియమించాలి'

సీతంపేట, ఆగస్టు 16(వార్త): గిరిజన అభివృద్ధి, సంక్షేమం కోసం సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా ఐఏఎస్ అధికారినే నియమించాలని గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు ఐఏఎస్ అధికారులనే నియమించారన్నారు. కానీ ప్రస్తుతం అనివార్య కారణాలతో ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను బదిలీ చేసి గ్రూపు 1 స్థాయిలోని ఆర్డీవోను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా నియమించారన్నారు. దీంతో గిరిజనులకు పూర్తిస్థాయిలో సంక్షేమం, అభివృద్ధి కార్యకలాపాలు చేయలేని పరిస్థితులు నెలకొంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఐటీడీఏ ఉంటుందన్నారు.ఆర్డీవో స్థాయి అధికారులు సొంత నిర్ణయాలు తీసుకోలేకపోవడంతో పూర్తి స్థాయిలో గిరిజనులకు న్యాయం చేయలేకపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారుల హయాంలో గిరిజనులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేకుంటే తాము పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ, గిరిజన ప్రజా సమాఖ్య ఉత్తరాంధ్ర అధ్యక్షుడు సవర చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు సవర మోహన్‌పాల్, ట్రైబల్ డెవలప్‌మెంట్ మిషన్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు మండంగి విశ్వనాథం, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నేతలు

## నేడు శ్రీకాకుళం రోడ్డు వరకే..
## విశాఖ-గుణుపూర్ రైలు

■ పలాస వరకే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్

పాతపట్నం, ఆగస్టు 16 (వార్త): నౌపడా-పర్లాకిమిడి మధ్య రైల్వే ట్రాక్ పనులతో శనివారం విశాఖ-గుణుపూర్ రైలు విశాఖ నుంచి శ్రీకాకుళం రోడ్డు వరకే వచ్చి తిరిగి వెళ్లిపోతుందని రైల్వే అధికారులు తెలిపారు. రూర్కెలా-గుణపూర్ మధ్య తిరుగుతున్న రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైలు రూర్కెలా నుంచి పలాస వరకే వచ్చి సాయంత్రం తిరిగి వెళ్లిపోతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని వారు సూచించారు.

## డేవిడ్ టీం సేవలు అమూల్యం



గార, ఆగస్టు 16 (వార్త): డేవిడ్ టీం సేవలు అమూల్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం అంపోలుకు చెందిన ఊట్ల హేమంత్ కొన్ని రోజులుగా లివర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డేవిడ్ తమ టీం సహకారంతో ఆయన చికిత్సకు అవసరమైన ఎంతో విలువైన మూడు ఇంజక్షన్లను సమకూర్చారు. వీటిని శుక్రవారం ఎమ్మెల్యే శంకర్ ద్వారా ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ యశోదమ్మ స్వచ్ఛంద సంస్థను స్థాపించి అనేకమైన కార్యక్రమాలను చేపట్టడం గొప్ప విషయమని కొనియాడారు. డేవిడ్ టీం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ శ్రీకాకుళం నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, ప్రదీప్ బెహరా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్ ఆహారం అద్భుతం

మందస, ఆగస్టు 16(వార్త): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాలు అద్భుతంగా ఉన్నాయని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, సోషల్ వర్కర్ ఔగాన ఈశ్వరరావు, పార్టీ నాయకులు సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎ.నారాయణ రావు, కె.సింహాద్రి, మద్ది సురేష్ అన్నారు. పలాసలోని అన్నక్యాంటీన్‌కు సొండిపూడి నుంచి వారంతా వెళ్లి పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టిన ఈ పథకం ఎంతో బాగుందన్నారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలను గత ప్రభుత్వం చేయలేదని ఆరోపించారు. స్వార్థం కోసం మంచి పథకాన్ని రద్దు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గౌతు శిరీష అన్నక్యాంటీన్లను తెరిపిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మాటకు కట్టుబడి అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి, పేదలకు రూ.5కే భోజనం అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే ఇటువంటి పథకాలు సాధ్యపడతాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలను అందిస్తారన్నారు.గౌతు శిరీషా ఎల్లప్పుడూ పేద పక్షాన ఉంటారన్నారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ వేతనాలు జమ



సారవకోట, ఆగస్టు 16 (వార్త): సారవకోట మండలంలో ఉపాధి హామీ కూలీలకు బకాయిలు ఉన్న వేతనాలను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు ఏపీవో నారాయణరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 7 నుంచి 8 వారాల బకాయి వేతనాల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మండలంలోని 10,734మంది వేతనదారులకు సుమారు రూ.3.5 కోట్లు వారి ఖాతాలకు జమ అయినట్లు వెల్లడించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## తడిసి ముద్దయిన క్రీడా మైదానం



నరసన్నపేట, ఆగస్టు 16 (వార్త): నరసన్నపేటలోని స్థానిక జూనియర్ కళా శాల ప్రాంగణంలో ఉన్న క్రీడా మైదానం బురదమయమైంది. శుక్రవారం ఉద యం కురిసిన భారీ వర్షంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇటీవల ఈ క్రీడా మైదా నాన్ని రూ.10 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు. కానీ పరిస్థితి మెరుగుపడే దిశగా కనిపించకపోవడంతో స్థానిక క్రీడాకారులు, వాకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సందడిగా రాఖీ వేడుకలు



నరసన్నపేట, ఆగస్టు 16 (వార్త): అడవి నారాయణవలసలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రాఖీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు.. విద్యార్థులకు రాఖీ కడుతూ 'నువ్వు నాకు రక్ష, నేను నీకు రక్ష' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ అభయాంజనేయ మండలి నిర్వాహకులు సిమ్మ లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయుడు సుధీర్, స్థానికులు పాల్గొన్నారు.

## శ్రీనాథుడుకు అవార్డుపై హర్షం



మందస, ఆగస్టు 16 (వార్త): మందస మండలంలోని మఖరజోల గ్రామానికి చెందిన బమ్మిడి శ్రీనాథుడుకు అవార్డు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈయన ఇక్కడ ఉపాధ్యాయునిగా పని చేస్తూనే .. గ్రూప్-1 సాధించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగంలో ఆయన చూపిన ప్రతిభ, అంకితభావం, నిజాయనిని అధికారులు గుర్తించి, ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించి, ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని స్థానికులు ఆకాంక్షించారు.

## లుకలాంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



నరసన్నపేట, ఆగస్టు 16 (వార్త): నరసన్నపేట మండలం లుకలాం పంచాయతీలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శి ముకుందరావు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి కాలువలను శుభ్రపరుస్తున్నామన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు రహదారులపై నిలిచిపోవ డంతో దీనిపై దృష్టి సారించామన్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొల గించామన్నారు.

## దుర్గంధభరితంగా రహదారి

భామిని, ఆగస్టు 16 (వార్త): భామిని రోడ్డులోని నులకజోడు సీసీ రహదారిపై చెత్త పేరుకుపోయింది. దీనికి తోడు వర్షాకాలం కావడంతో రోడ్డు దమ్ము పొలాన్ని తలపిస్తోంది. ఈ విషయం సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త అంతా బురదగా తయారై.. పాదచారులు కూడా నడవలేని దుస్థితి ఏర్పడిందని వాపోయారు. దుర్వాసనతో పాటు, వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని జనసేన నాయకులు, స్థానికులు కోరుతున్నారు.



# అలుపెరుగని పోరాట యోధుడు లచ్చన్న

మందస, ఆగస్టు 16(వార్త): బ్రిటిష్ పాలకులపై అవిశ్రాంత పోరాటాన్ని గౌతు లచ్చన్న సాగించారని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు అన్నారు. బాలిగాం-హరిపురం జంక్షన్, మందసలోని సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాల వద్ద ఆయన 115వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం లచ్చన్న ఎంతో చేశారన్నారు. రైతుల కోసం శ్రీకాకుళం నుంచి చెన్నై వరకు పాదయాత్ర చేశారన్నారు. ఐదుసార్లు ప్రజాప్రతినిధిగా గెలుపొందిన వ్యక్తి లచ్చన్న అన్నారు. నేటి నాయకులెందరికో లచ్చన్న ఆదర్శం అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నేటితరం నేతలంతా కలిసి పని చేస్తామన్నారు. ఎన్జీ రంగాకు శిష్యుడిగా ఆయన కోసం తన పదవినే వదిలేశాన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, డుంకురు తిరుపతి, రట్టి లింగరాజు, గువ్వాడ లక్ష్మీనారాయణ, రాజాన మహేష్, బమ్మిడి కర్రయ్య, దేవరశెట్టి మార్కండేయులు, గుంట చక్రపాణి, గుంట పున్నయ్య, తమరి భాస్కరరావు, సాలిన జానకిరావు, భైరిశెట్టి గున్నయ్య, సింగుపురం వెంకటరావు, బొంగు దామోదరం, కొర్నాన నాగేశ్, దేఖాశిశేపండా, గోపీకృష్ణ మహంతి, ఎం.నవీన్‌కుమార్, మండల లచ్చయ్య, దున్న పురుషోత్తం, రెల్ల జగదీశ్, సవర చంద్రశేఖర్, ముంజేటి చంద్రశేఖర్, కుప్పిలి వెంకటరావు, భైరి హేమరాజు, నోంద్రాన షణ్ముఖరావు, జనసేన అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్నకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు(ఇన్‌సెట్‌లో లచ్చన్న విగ్రహం)

## కొమ్ముువలస-గొట్టిపల్లి రోడ్డుకు మోక్షమెన్నడు?

(ఎల్‌ఎన్ పేట)

కొమ్ముువలస-గొట్టిపల్లి రహదారి చాలా అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షానికే వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోతుందని, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సివస్తోందని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డుకు మోక్షం కలగలేదు. ఈ ప్రభుత్వమైనా రోడ్డు బాగుకు చర్యలు చేపట్టదా! అన్న ఆశతో ప్రజలు, వాహన చోదకులు, విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు కలుగజేసుకుని తక్షణమే రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు



# సారా స్థావరాలపై సెబ్ అధికారుల దాడి

■ 1100 లీటర్ల బెల్లం ఊట, 20 లీటర్ల సారా ధ్వంసం

మందస, ఆగస్టు 16 (వార్త): మందస మండలంలోని గిరిజన పంచాయతీ కొండలోగాం ప్రాంతంలోని సారా తయారీ కేంద్రాలపై సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు దాడులు నిర్వహించారు. జన్ని వీధి గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా భూమిలో పాతిపెట్టిన 1100లీటర్ల బెల్లంఊటను బయటకు తీసి ధ్వంసం చేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల సారా కూడా ధ్వంసం చేశారు. గ్రామంలో ఎవరు సారా బట్టీలు నిర్వహిస్తున్నారో విచారణ చేసి, వారిపై చర్యలు తీసుకుంటామని సెబ్ సోంపేట సీఐ జైభీమ్ తెలిపారు. సారా తయారీ, రవాణా, అమ్మకాలపై 9440902358 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది మోహనరావు, కాంతారావు, యోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న రెడ్డి శాంతి

కొత్తూరు, ఆగస్టు 16 (వార్త): రైతుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. శుక్రవారం ఆమె పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. రైతు సంక్షేమమే తమ ధ్యేయం అంటూ ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని, ఆ తర్వాత రైతాంగ సమస్యలు గాలికి వదిలేశారని విమర్శించారు. వరి నాట్లు పడుతున్న సమయంలో రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా జగన్ రైతుల ఇంటి వద్దకే ఎరువుల తీసుకెళ్లారని చెప్పారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు కేటాయింపు పూర్తిగా తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ డీలర్లకు ఎరువుల కేటాయించడంతో రైతులు అధిక ధరలకు కొనుగోలు చేసే దుస్థితి నెలకొందన్నారు. అధిక ధంలకు కొనుగోలు చేయటంతో రైతులకు అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సాగుకు పెట్టుబడి అవసరమైన ఈ రోజుల్లో రైతు భరోసా నిధులు చెల్లించకపోవడం దారుణం అన్నారు. సాగుకు పెట్టుబడి రైతులు వద్ద లేకపోవడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారం నుంచి అధిక వడ్డీలకు అప్పులుగా వాడి సాగుకు పెట్టుబడి పెట్టాల్సిన దుస్థితి కూటమి ప్రభుత్వంలో నెలకొందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి జిల్లాకు చెందిన వారు అయినప్పటికీ జిల్లా రైతాంగానికి ఒరిగింది ఏమీ లేదన్నారు. జిల్లాకు అవసరమైన డీఏపీ, యూరియా ఇతర ఎరువులు కేటాయింపు చేయుటలో నిర్లక్ష్యం వహిస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు రైతులు కొనుగోలు చేయడం తప్పడం లేదన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి ప్రైవేట్ డీలర్లకు ఎరువులు, విత్తనాలు కేటాయిస్తున్నట్టు ఆరోపించారు. భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సుల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రైతు రుణాలకు సంబంధించిన అసైన్డ్ పత్రాలు నిలుపుదలతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతు సమస్యలను గుర్తించి, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగిస్తే రైతుల నుంచి తగిన గుణపాఠం కూటమి ప్రభుత్వానికి తప్పదని ఆమె హెచ్చరించారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## నేటి నుంచి సత్యసాయి దీక్షలు

**హిరమండలం, ఆగస్టు 16 (వార్త):** భగవాన్ సత్యసాయి బాబా 99 జయంతి వేడుకలను పురస్కరించుకుని 99 రోజుల పాటు సత్యసాయి దీక్షలు సమర్ధవంతంగా నిర్వహించాలని సత్యసాయి జోనల్ కన్వీనర్ బెహరా సురేష్ (చంటి) మాస్టారు కోరారు. శుక్రవారం జోనల్ పరిధిలో పలు సత్యసాయి భజనా మండలిలో 99 రోజుల దీక్ష కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి నవంబర్ 23 భగవాన్ సత్యసాయిబాబా జయంతి వరకు 99 రోజుల పాటు సత్యసాయి దీక్షలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

### 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్..

# కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

*** కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * జిల్లా అధికారులతో సమావేశం**



**శ్రీకాకుళం, ఆగస్టు 16 (వార్త):** 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి ఆయన జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. నీతిఆయోగ్ సహాయ సహకారాలుతో నిర్ధేశిత లక్ష్యాలను నిర్ణయించుకొని అన్ని ప్రాథమిక రంగాల్లో అభివృద్ధికి 100 రోజులు, సంవత్సర ప్రణాళికలను తయారు చేయడమైనదని తెలిపారు. అదే విధంగా 2047 నాటికి లక్ష్యాలను ఏర్పరచుకొని అధిక వృద్ధి రేటును లక్ష్యంగా ఏర్పరచుకొని గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రణాళికలు తయారుచేబడునని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యంతో మౌలిక వసతులు నిర్మాణం జరుగునని తెలిపారు. పేదరిక నిర్మూలన చేస్తూ సంపన్న పేద వర్గాల మధ్య అంతరాన్ని తగ్గించడం జరుగుతుందని వివరించారు. ప్రాథమిక అవసరాలైన తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, విద్య, ఆస్తుల నిర్వహణలో అందరికి సముచిత న్యాయం జరగాలన్నదే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ, గిడ్డంగుల నిర్వహణ, పునరుద్పాదక ఇందన వనరులు, వాణిజ్య పరంగా పర్యాటకాభివృద్ధి, వంటి నేపధ్య రంగాల్లో మండలాల భౌగోళిక, ఆర్ధిక పరిస్థితులకు అనుగుణంగా లక్ష్యాలను మండలాల వారీగా అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో రిజర్వాయర్ పూర్తి చేయండి

***ఉత్తరాంధ్ర ప్రాజెక్ట్‌లు ఛీఫ్ ఇంజనీర్ సుగుణాకర్ రావు**



**హిరమండలం, ఆగస్టు 16 (వార్త):** వంశధార జలాశయం పనులను సకాలంలో పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర ప్రాజెక్టల ఛీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకర్ రావు సూచించారు. శుక్రవారం మండలంలో వంశధార జలాశయంతో పాటు స్పిల్‌వే, జలాశయానికి నింపే కుడి కాలువ వద్ద నిర్మాణం జరుగుతున్న ఎత్తిపోతల పథకం పనులను వంశధార కట్టడాల విభాగం ఎస్ఈ రాంబాబు ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార జలాశయం పనులు వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగా డిప్యూటి ఎస్ఈ స్వర్ణకుమార్, ఈఈ ఎంవి.రమణలతో కలసి నేరడి, పారాపురం పరిధిలో ఉన్న 87,88 ప్యాకేజి పనులను పరిశీలించామన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం కలుగుతున్నప్పటికీ వాటిని అధిగమించి పనులు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించామన్నారు. ఇప్పటికే వంశధార జలాశయం పనులు 95 శాతం మేర పనులు పూర్తి అయ్యాయని, మిగతా పనులు ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు కూడా పూర్తిస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయన వెంట డీఈఈలు రవికాంత్, సురేష్, రవీంద్ర, ఏఈఈలు వినోద్, విశ్వనాధం, వంశధార, ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన కాంట్రాక్టర్ల ఉన్నారు.

# కాలభైరవ ఆలయంలో శ్రావణ పూజలు

*** ఐదులక్షల గాజులతో అమ్మవారికి అలంకరణ * 120 రకాల పిండివంటలతో నైవేద్యం * పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులు**



**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 16 (వార్త):** సృష్టికి మూలంబాలా త్రిపుర సుందరి కాలభైరవి అని, భక్తి శ్రద్ధలతో కొలిస్తే కోరిన కోరికలు సిద్ధిస్తాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని బలగలోని నాగావళి నదీ తీరాన వెలసిన బాలా త్రిపుర సుందరి కాలభైరవ ఆలయంలో గణేష్ గురువు ఆధ్వర్యంలో శ్రావణమాస పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఐదులక్షల గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అ120 రకాల పిండి వంటలతో నైవేద్యాలు ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న గొండు శంకర్, స్వాతి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో తెలుగుయువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, ఆలయ అధ్యక్షులు రెడ్డి గిరిజాశంకర్, సాధు రామారావు, రామకృష్ణ, చిట్టి విష్ణు, రంజిత్, జగన్ స్వామి, పీఠం సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమాల నిర్వహణలో సహకారమందించారు.



## క్రిమినల్ కేసులపై దృష్టి సారించండి

*** జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా * జిల్లా పోలీసు అధికారులతో సమావేశం**

**శ్రీకాకుళం లీగల్, ఆగస్టు16 (వార్త):** వచ్చేనెల 14న నిర్వ హించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువగా క్రిమినల్ కేసులపై దృష్టి సారించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జూనైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక జిల్లా కోర్టు భవనంలో శుక్రవారం జిల్లా పోలీసు, ఎక్సైజ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులను ఎక్కువ చేయాలని కోరారు. కక్షి దారుల మధ్య రాజీ చేయడం ద్వారా ఇరు పార్టీలకు న్యాయం చేకూరుతుం దన్నారు. సమావేశంలో ఎస్ఎం ఫణి కుమార్, 4వ అదనపు జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్ సన్యాసి నాయుడు, ఏఎస్పీ ప్రేమ్ కాజల్, పోలీస్, ఎక్సైజ్ అధికారులు, పబ్లిక్ ప్రాసెక్యూటర్లు సిహెచ్ సత్యనారాయణ, నాగ భూషణరావు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి



**పలాస, ఆగస్టు 16 (వార్త):** సర్దార్ గౌతు లచ్చన్న 115 వ జయంతి వేడుకలను పలాసలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు పలువురు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌతు లచ్చన్న ఉత్తరాంధ్ర నుంచి ఎగసిపడ్డ రాజకీయ కెరటమన్నారు. జీవితాంతం బలహీనవర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన పేదల ఆశాజ్యోతి అని తెలిపారు. దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి ఆయనేనని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారుడిగా, రాజకీయ నాయకుడిగా గౌతు లచ్చన్న సాగించిన ప్రయాణం ఆయన్ను మహనీయునిగా నిలబెట్టిందన్నారు. అనంతరం గౌతు లచ్చన్న అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబురావు, పి.విఠల్ రావు, లోడగల కామేశ్వరరావు, గాలి క్రిష్ణరావు, బడ్డ నాగరాజు, సప్ప నవిన్, జోగ మల్లి, రామక్రిష్ణ, చంద్రరావు, అనిల్ శర్మ, చక్రధర్, దడియాల నర్సింహులు, అంబటి క్రిష్ణమూర్తి, నాబెల్లి శ్రీను, కొరికాన శంకర్, స్వరం రాంబాబు, కొండే నర్సింహులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.5లకే పేదలకు కడుపునిండా భోజనం

*** ఎమ్మెల్యే గౌతు శిరీష**

*** కాశీబుగ్గలో అన్నా క్యాంటిన్ ప్రారంభం**

**పలాస, ఆగస్టు 16 (వార్త):** ఐదు రూపాయలకే పేదలకు కడుపు నిండా భోజనం పెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ పాతబస్టాండ్ పరిసర ప్రాంతంలో ఉన్న అన్నా క్యాంటిన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అనే కళ్లబొల్లి మాటలు చెప్పే పార్టీ టిడిపి కాదని, పేదలందరికి సంక్షేమం అందించాలనే భాగంగా వందరోజుల పాలనలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్న నాయకుడు చంద్రబాబు ఆలోచన నుంచి పుట్టిందన్నారు. గతంలో టీడీపీని విమర్శించిన వైసీపీ నాయకులు కూడా అన్నాక్యాంటిన్లో భోజనం చేసి వెళ్లవచ్చని తమకు అభ్యంతరం లేదన్నారు. పేదలకు మూడు పూటలు ఐదు రూపాయలకే భోజనం అందించే కార్యక్రమం తాము ప్రారంభించడం గర్వంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీనివాస్, గాలి క్రిష్ణారావు, పైల చక్రధర్, కమీషనర్ టి. నాగేంద్రకుమార్ ఉన్నారు.



## ప్రభుత్వ మద్యం షాపులో చోరీ

**పలాస, ఆగస్టు 16 (వార్త):** కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వం మద్యం దుకాణంలో ఈనెల 14వ తేదీ రాత్రి చోరీ జరిగింది. దుకాణం మూసివేసిన సమయానికి కౌంటర్లో 2.14 లక్షలు నగదు ఉందని క్యాషియర్ తెలిపారు. 15న సెలవు అనంతరం శుక్రవారం ఉదయం 11 గంటలకు దుకాణం తెరవగా కౌంటర్లో కేవలం 6500 రూపాయలు నగదు మాత్రమే ఉందని తెలిపారు. వెనుక భాగం నుంచి తాళాలు పగలు గొట్టి దొంగలు 2.8లక్షలు నగదు దోచుకున్నారని ఫిర్యాదు చేశారు.



## చంద్రబాబు మానస పుత్రిక..

# అన్నా క్యాంటీన్

*** కూటమి ప్రభుత్వం... పేదల ప్రభుత్వం * అధికారంలో లేకున్నా సంకల్ప బలంతోనే అన్న క్యాంటీన్ కొనసాగించాం * జగన్మోహన్ రెడ్డి నరరూప రాక్షసుడు * పేదవాడి పొట్ట కొట్టిన దుర్మార్గుడు సైకో జగన్ * అన్నా క్యాంటీన్ కు దాతలు విరాళాలు ఇవ్వండి * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * ఎమ్మెల్యే గొండు శంకర్‌కు అభినందనలు**

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 16 (వార్త):** చంద్రబాబు మానస పుత్రిక అన్నా క్యాంటీన్ అని, ఎందరో పేదలు, కార్మికులకు తక్కువ డబ్బులకే కడుపు నింపిందని వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్థక, డైరీ డవలప్‌మెంట్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం ఏడురోడ్ల కూడలిలోని దివంగత మహానేత ఎన్‌టీ రామారావు, దివంగత కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నగరంలోని ఏడురోడ్ల కూడలి, పాతబస్టాండ్‌లలో మంత్రి అచ్చెన్నాయుడు అన్న క్యాంటీన్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు కడుపునిండా భోజనం పెట్టే ఈ గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మానసపుత్రిక అన్న క్యాంటీన్ కార్యక్రమం అని ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. సేవాభావంతో ముందుకు వచ్చి అన్న క్యాంటీన్లకు విరాళాలు ఇచ్చి.. పేదల కడుపు నింపడంలో మీ వంతు పాత్ర పోషించాలని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. నాడు స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో డొక్కా సీతమ్మ గోదావరి దాటి వచ్చిన



ప్రతీ ఒక్కరికీ కడుపునిండా అన్నం పెట్టేదన్నారు. ఏ సౌకర్యాలు లేని సమయంలోనే పేదల కడుపు నింపిన గొప్ప మహోన్నత వ్యక్తిత్వం కలిగిన గొప్ప మానవతావాధి డొక్కా సీతమ్మ అని కొనియాడారు. అటుతరువాత 1983లో అధికారంలోకి వచ్చిన తరువాత దివంగత మహానేత ఎన్‌టీఆర్ తిరుపతిలో అన్నదాన ట్రస్ట్‌ను ప్రారంభించారని చెప్పారు. ప్రతీరోజు వేలాది మంది భక్తులు వచ్చి తన ఆకలి



తీర్చుకునే వారని చెప్పారు. ఈ ట్రస్టుకు దాతల నుంచి రూ.1000 కోట్లు ఆదాయం వచ్చిందని దానిని బ్యాంకుల్లో ఉంచి దాని వడ్డీతోనే నిత్యాన్నదాన కార్యక్రమాలు కొనసాగించారన్నారు. వారి స్ఫూర్తితో చంద్రబాబునాయుడు 2014 నుంచి 2019 మధ్య రాష్ట్ర వ్యాప్తంగా 200కు పైగా అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. పేదవాడి కడుపునింపేందుకు భవనాలు నిర్మించి పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యమైన భోజనాన్ని రూ.15కే అందించామని చెప్పారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత అన్న క్యాంటీన్లు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఓ నరరూప రాక్షసుడని, అన్నాక్యాంటీన్లను మూసివేయవద్దని ఆయన దండాలు పెట్టామని తెలిపారు. ఈ పథకం ప్రభుత్వానికి భారం కాదని దాతలు వస్తారని పథకం కొనసాగించాలని పట్టించుకోలేదని చెప్పారు. అన్నాక్యాంటీన్లు మూసేస్తే సొంత డబ్బులతో అన్నాక్యాంటీన్లు పెడతామంటే వాటి కోసం వేసిన షెడ్లను కూడా తొలగించి అన్న క్యాంటీన్ అన్న మాట కూడా విన్పించకుండా చేయాలన్న కుట్ర సైకో జగన్ పన్నాగని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదు సంతకాల్లో అన్నాక్యాంటీన్ ఏర్పాటుపై కూడా చేయడం జరిగిందన్నారు. చంద్రబాబునాయుడుకు, తనకు తమ 40 ఏళ్ల రాజకీయ జీవితాల్లో అన్నక్యాంటీన్లు ఎంతో సంతృప్తి నిచ్చాయని చెప్పారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు సర్కార్ ఏర్పాటవటంతో అన్న క్యాంటీన్లు పునః ప్రారంభం అవుతున్నాయని చెప్పారు. తొలిదశలో భాగంగా 100 క్యాంటీన్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు. త్వరలో మండల పరిధిలో కూడా అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు.

### గొండు శంకర్ గొప్ప మానవతావాది

రాష్ట్రంలో అన్నాక్యాంటీన్లు మూత పడిన తరువాత పేదల, రోజువారీ కూలీల కడుపు నింపాలన్న ఆలోచనతో టెక్కలి, పాతపట్నంలో, శ్రీకాకుళం నగరంలో అన్నాక్యాంటీన్లు ప్రారంభించాలని పిలుపునిచ్చానని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో గొండు శంకర్ నగర పరిధిలో ఐదు చోట్ల మొబైల్ వ్యాన్లను ఏర్పాటు చేసి 484రోజుల సుదీర్ఘకాలం పాటు తన సొంత ఖర్చులతో అన్న క్యాంటీన్‌ను కొనసాగించాడని మంత్రి తెలిపారు. మండుటెండల్లోనూ, జోరు వానల్లోనూ, పండుగలున్నా, బంద్‌లున్నా ఏనాడూ అన్నక్యాంటీన్ మూసి వేయకుండా నిర్విరామంగా కొనసాగించిన గొప్ప మానవతావాధి గొండు శంకర్ అని కొనియాడారు. సుమారు 2,50,000 మందికి అన్నం అందించిన గొండు శంకర్‌కు వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అచ్చెన్నాయుడు చెప్పారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన సహాయకులకు అభినందిస్తూ మంత్రి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, కమిషనర్ చల్లా ఓబులేష్, బిజెపీ నాయకులు పైడి వేణుగోపాలం, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతితో పాటు టీడీపీ, జనసేన, బీజెపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలకు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**హిరమండలం, ఆగస్టు 16(వార్త):** హిరమండలం సబ్‌స్టేషన్ పరిధి 33/11 కేవి పరిధిలో హిరమండలం ఫీడర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ హిరమండలం ఫీడర్ పరిధిలో చెట్లు కొమ్మలు తొలగింపు, నిర్వహణ చేపడుతుండటం వల్ల హిరమండలం, శుభలాయ్, నౌగూడ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులకు సహకరిం చాలని ఆయన కోరారు.

## ఏఎస్పీ ప్రేమ్‌కాజల్‌కు విశాఖ బదిలీ

*** శ్రీకాకుళం ఏఎస్పీగా ప్రభాకరబాబు**

*** విజిలెన్స్ ఎస్పీ, సెబ్ ఏఎస్పీలకు హెడ్‌క్వార్టర్స్‌కు..**

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 16 (వార్త):** రాష్ట్రవ్యాప్తంగా ఏఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 మంది ఏఎస్పీల కు బదిలీ అయింది. శ్రీకాకుళం ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జి.ప్రేమ్‌కాజల్ విశాఖ సీఐడీ ఏఎస్పీగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సీఐడీ (టెక్నికల్ సర్వీసెస్) ఏఎస్పీగా ఉన్న టీటీ ప్రభాకర బాబు ను నియమించారు. అలాగే విజిలెన్స్ ఎస్పీ ఎ.సురుష్ బాబుకు, సెబ్ అడిషనల్ ఎస్పీ డి.గంగాధరం ఇక్కడి నుంచి బదిలీ చేస్తూ విజయవాడ పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీఅయ్యాయి.

## ఐదు రోజులు వేడుకగా..

## గౌతు లచ్చన్న జయంతి నిర్వహించాలి

*** బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు**



**శ్రీకాకుళం, ఆగస్టు 16 (వార్త):** సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాలను ఐదు రోజులు పాటు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమమహేశ్వరరావు కోరారు. శుక్రవారం సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సర్దార్ గౌతు లచ్చన్న ఎనలేని సేవలు అందించి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రతీ ఒక్కరూ ఆయన్ని తమ హృదయాల్లో పెట్టుకోవాలన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సర్దార్ గౌతులచ్చన్న సంస్మరణ సభలో ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చంనాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, నరస్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట రమణ పాల్గొన్నారు.



## ఉత్తమ ఆశ వర్కర్ అవార్డు గ్రహీత రాజేశ్వరికి అభినందనలు

**సంతబొమ్మాళి, ఆగస్టు 16(వార్త):** మండలం మేఘవరం పంచాయతీకి చెందిన ఆశావర్కర్ సూరాడ రాజేశ్వరి స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఆశా వర్కర్ గా గురువారం రాష్ట్రమంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తీర ప్రాంతంలో ఆమె చేస్తున్న వైద్య సేవలను వైద్యశాఖ అధికారులు గుర్తించి అవార్డుకు ఎంపిక చేసారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న రాజేశ్వరికి మరువాడ పంచాయతీ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసురాజు, మత్స్యకార నాయకులు, గ్రామ పెద్దలు, ఆశా వర్కర్ యూనియన్ సభ్యులు, అంగన్వాడి సభ్యులు, సచివాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు అభినందించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రతిభ అవార్డులు పంపిణీ

**సంతబొమ్మాళి, ఆగస్టు 16 (వార్త):** పాతమేఘవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా మత్స్య కార సహకార సంఘం డైరక్టర్ సూరాడ జోగారావు నగదు ప్రోత్సమకాలు అందించారు ప్రధాన ఉపాధ్యాయులు యు.డి.వి.ప్రసాదరావు అధ్యక్షతన సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 545 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన సుగ్గు సుశీలకు రూ.3 వేలు నగదు, 543 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన చోడిపల్లి శివకు 2 వేలు నగదు అలాగే 539 మార్కులతో తృతీయ స్థానం సాధించిన అర్జాల పూజ, తుంబల సాయి దీపికలకు చెరో వెయ్యి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పరపటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సూరాడ భీమారావు, ఉప సర్పంచ్ మంకు సింహాచలం, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గాడి లక్ష్మి, యంపల్ల దుర్గా ప్రసాద్, సిరిగిడి రాము, నందుపిల్లి రామారావు, దీర్ఘాసి జయరాం, సి.ఆర్.పి. ఏ.తేజారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, దుర్యోధన, శివ జ్యోతి, వైస్ చైర్మన్ సి.హెచ్.చెంచయ్య, సూరాడ అప్పల కొండ తదితరులు పాల్గొన్నారు.



## అవయవదానంతో.. మరోజన్మ

**శ్రీకాకుళం, ఆగస్టు 16 (వార్త):** అవయవ దానం చేయడం వల్ల మరణానంతరం మరో రూపంలో జీవిస్తుంటామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొందు శంకర్ అన్నారు. లావేరు మండలం అదపాక గ్రామానికి చెందిన దుక్క భాస్కరరావు(22) ఈ నెల 14 పెయింటింగ్ పనికి వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. దీంతో అతడిని జెమ్స్ ఆస్పత్రి లో చేర్చారు. బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ధ్రువీకరించి కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లారు. వారికి అవయవ దానం పట్ల అవగాహన కల్పించారు. దీంతో కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకువచ్చారు. ఈమేరకు శుక్రవారం భాస్కరరావుకు శస్త్ర చికిత్స చేసి రెండు కిడ్నీలు, లివర్‌ను తొలగించారు. వాటి లో ఒక కిడ్నీని జెమ్స్‌కి, మరొకటి విశాఖ, లివర్‌ను విశాఖలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం భాస్కర్ కుటుంబ సభ్యులకు అవయవదాన పత్రాన్ని శంకర్ అందజేశారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్, మెడికల్ సూప రింటెండెంట్ శ్రీనివాసు, వైద్యులు శివాన్వేష్, ప్రవీణ్, జ్యోత్స్న పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు

**కొత్తూరు,ఆగస్టు 16 (వార్త):** మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వరలక్ష్మీ దేవి పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజలలో కొత్తూరు గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షులు పొగిరి రవి పాల్గొన్నారు.

**ఎల్ఎన్‌పేట, ఆగస్టు 16 (వార్త):** శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ దేవి పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున నుంచి ఇళ్లను పరిశుభ్రం చేసి ముగ్గులు, తోరణాలు, పూలతో అలంకరించి పూజలు,వ్రతాలు చేశారు.



# దివ్యాంగులను ఆదుకుంటాం

*** విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికే.. స్వాభిమాన్**

*** జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్**

*** 46 వినతుల స్వీకరణ**

**శ్రీకాకుళం, ఆగస్టు 16 (వార్త):** విభిన్న ప్రతిభావంతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం స్వాభిమాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, దివ్యాంగులు వారి సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో గల గ్రీవెన్స్ హాలు నందు విభిన్న ప్రతిభా వంతుల వినతుల స్వీకరణ "స్వాభిమాన్" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ మహమ్మద్ ఖాన్‌తో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ పనులపై కలెక్టరేట్ కు వస్తున్న దివ్యాంగుల కోసం ర్యాంపు జిల్లా కలెక్టర్ రత్నాల శ్రీనివాసరావు, మల్లారెడ్డి భాస్కర్ రావు దివ్యాంగుల సంఘ సభ్యులతో రిబ్బన్ కట్ చేయించి ర్యాంప్ ప్రారంభించారు. కార్యక్రమం వద్ద శ్రీకాకుళం మండలానికి చెందిన మట్టనీలం యాదవ్ దివ్యాంగుల జిల్లా అధ్యక్షులుతో జిల్లా కలెక్టర్ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాకి అంధుల పాఠశాల, దివ్యాంగులకు జిల్లా ప్రధాన కేంద్రంలో హోమ్ కావాలని కోరగా అందుకు చర్యలు చేపడతామన్నారు. మందస మండలం, సొండి పూడి గ్రామానికి చెందిన వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి భాస్కరరావు, మాట్లాడుతూ మాకు ఒక ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన రత్నాల శ్రీనివాసరావు దివ్యాంగుల అధ్యక్షులు మాట్లాడుతూ నిజమైన వికలాంగులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం 10 గంటల నుండి 12 గంటల వరకు జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుండి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా పరిషత్ సిఈఓ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి తో కలసి వినతులు స్వీకరించారు. స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమానికి 46 వినతులు వచ్చాయి. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రతీ నెల మూడవ శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు వారి సలహా మేరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు ఎందులోనూ తీసి పోరని చెప్పారు. వారు ఆర్టీసీ బస్సుల్లో సులువుగా ప్రయాణించేందుకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ అప్పారావు, డిపిఓ వెంకట్వేశ్వర్ రావు, డిఆర్డిఎ ప్రాజెక్ట్ అధికారి కిరణ్ కుమార్, ఆర్.అండ్.బి ఎస్ ఇ జాన్ సుధాకర్, ఎఐఈఈ రాజు, రిమ్స్ సుపరింటెండెంట్ డా. షకీలా,, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి మీనాక్షి, సిపిఓ ప్రసన్న లక్ష్మి, జిల్లా నలుమూలల నుంచి పలువురు దివ్యాంగులు, బధిరులు, బ్లైండ్ సంఘాల సభ్యులు తదితరులు హాజరయ్యారు.









# రెండేళ్లలో ఆఫ్‌షోర్ పూర్తి

*** ఏడాదిలో రైల్వే వంతెన నిర్మిస్తాం * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

*** వంశధార, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష**

**పలాస, ఆగస్టు 16(వార్త):**రెండేళ్లలో ఆఫ్‌షోర్ రిజర్వాయర్, ఏడాదిలో కాశీబుగ్గ రైల్వే వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. పలాస తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆధ్వర్యంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి వంశధార, ఇరిగేషన్, రోడ్డు భవనాల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009లో 129 కోట్లు అంచనాలతో ప్రారంభమైన ప్రోజెక్టు నేటికి పూర్తికాలేదన్నారు. మాజీ మంత్రి గౌతు శివాజి హయంలో 450 కోట్లు మంజూరు చేసుకొని 70 శాతం పనులు పూర్తి కాగా, గత ప్రభుత్వ హయాంలో కేవలం ఏడు శాతం పనులు చేపట్టి ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. నేడు మరో 300 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే ప్రోజెక్టు పూర్తవుతుందన్నారు. పనులు రేపటి నుంచే ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఆఫ్ షోర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రస్తుతం ఆఫ్ షోర్ పనులు కొనసాగించేందుకు బడ్జెట్లో 28 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింద న్నారు. ఆర్‌ఆండ్‌ఆర్ సమస్యల కోసం అవసరమైతే రెండు కోట్లు అధనంగా ఖర్చు అయినా వెనుకడుగు వేయమన్నారు. ఆరు గ్రామాల నిర్వాసితులు గ్రామాలు, ఆర్ఆర్ కోలనీ ప్రాంతాలు, ఆఫ్ షోర్ రిజర్వాయర్ పనులపై ప్రత్యేక అధికారులను నియమించి పనులు శరవేగంగా జరిగే విదంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. వంశదార అధునీకరణ పనులను కూడా చేపట్టి శివారు ప్రాంతాలకు సాగునీరు అందిస్తామన్నారు. రైల్వే వంతెన పనులు పూర్తి చేసేందుకు 15 కోట్లు అవసరం కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి నిధులు మంజూరు చేయించి ఏడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. మందుగా రైల్వే వంతెన నిర్వాసిత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను అదేశించారు. అనంతరం చీపురుపల్లి, రేగులపాడు నిర్వాసితులు మాట్లాడుతూ తమకు ఆర్ఆర్ కోలనీ కేటాయించి నప్పటికీ ఇంత వరకు స్థలం చూపించలేదని, కొంత మందికి నష్టపరిహారం అందలేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో జెసి ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ భరత్నాయక్, వంశదార చీఫ్ ఇంజినీరు సుగణాకర్, ఎస్ఐ రాం బాబు, డిఎస్పి పి. వి. తిరుమలరావు, ఇఇ శేఖర్, అర్అండ్ ఎస్ఇ జాన్ సుధాకర్, ఇఇ పి.సత్యన్నారాయణ, డిఇ ఎస్.రామినాయుడు, ఎఇ విక్రమ్, పలాస, వజ్రపు కొత్తూరు, నందిగాం, మెళియాపుట్టి మండలాల తాహిసిల్దార్లు, ఎంపిడిఓలు వివిద శాఖల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. పలాస కాశీబుగ్గ మున్సి పాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, జలజీవన్ మిషన్ నుంచి మున్సి పాలిటీకి తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెంనాయుడుతో పాటు జిల్లా కలెక్టర్ స్వప్నిక్ దినకర్ దృష్టికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తీసుకువెళ్లారు. మున్సిపాలిటీ కెటిరోడ్ విస్తరణ పనులు పూర్తిస్థాయిలో జరగలేదని, చినుకుపడితే స్విమ్మింగ్‌పూల్గా తయారు అవుతుందని శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. విస్తరణ పనుల్లో భాగంగా వ్యాపారులకు ఇస్తామన్నా టిడిఆర్ కూడా ఇంత వరకు ఇవ్వలేదన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413